సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 24 । అక్టోబర్ । 2024



సోమశిలలో 61.111 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 61.111 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 18,680 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.81 వేలు
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,340
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,560
నవర (8 గ్రాములు)	రూ.60,480

గరిష్టం/కనిష్టం
35.2 /26.6

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉన్నా.. సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 63 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

29, 30 తేదీల్లో ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయిలో సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలను, దర్గామిట్ట నెల్లూరు క్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలను నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన సివిల్ సర్వీస్ ఉద్యోగులు సంబంధిత కార్యాలయ అధిపతి నుంచి తమ పేరు, హోదాను తెలిపే లేఖ, క్రీడా దుస్తులతో పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి ఎంపికైన వారు విజయవాడ, గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు జాతీయ స్థాయి పోటీలకు అర్హులని వివరించారు. ఇతర వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగరం తహసీల్దార్ సస్పెన్షన్



తహసీల్దార్ వీర వసంతరావు

సోమశిల: అనంతసాగరం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వీరవసంతరావును సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఓ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పొదలకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సమయంలో భూ అక్రమాలకు పాల్పడినట్లు టీడీపీ నేతలు చేసిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిన జిల్లా అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రం వదిలి ఎక్కడికి వెళ్లొద్దని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

206 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 206 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,021 మంది విద్యార్థులకు 206 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ ఇరిగేషన్ల వారీగా సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సోమశిల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని సోమశిల ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయంలో తెలుగుగంగ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, సాగునీటిశాఖ ఎస్‌ఈ దేశ్‌నాయక్‌తో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ ఇరిగేషన్ల వారీగా జాబితా సిద్ధం చేయాలన్నారు. ఓటరు జాబితా రెవెన్యూ అధికారులతో కలిసి పక్కాగా నిర్వహించాలని సూచించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో ఈఈ సత్యకుమార్, గురుప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు రాక

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలతో డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించడంపై జిల్లాలో అమలవుతున్న విధానాలను ఆమె పరిశీలిస్తారని తెలిపారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు చేరుకుంటారు. 2 గంటల వరకు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. భోజనానంతరం 5 గంటల వరకు బీసీ, సాంఘిక, సంక్షేమ, గిరిజన హాస్టల్ వార్డెన్స్, అధికారులతో సమీక్షిస్తారు. 26వ తేదీ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యాశాఖలోని అన్ని విభాగాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్థానికంగా ఉన్న హాస్పిటల్స్, సచివాలయాలను సందర్శిస్తారని కలెక్టర్ వివరించారు.

ప్రతిభకు పాతర

చిట్టి బుర్రల నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన యాజమాన్యాలు తొక్కేస్తున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థుల ప్రతిభకు పాతరేస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజ్ఞ, గుణాత్మక విద్యకు విద్యార్థులను దూరం చేస్తోంది. కేవలం పుస్తకాలతో కుస్తీ పట్టించి మార్కులు, ర్యాంకులు సాధించాలని తహతహలాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి ఆదరణ కరువైంది. ప్రాజెక్ట్‌ల ప్రదర్శనకు నిధులు కేటాయించాలనే ఉద్దేశంతోనే యాజమాన్యాలు ముఖం చాటేశాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇన్‌స్పైర్ మనక్ నిర్వహణపై యాజమాన్యాల నిరాసక్తత

- జిల్లాలో 1,124 యూపీ, హైస్కూల్స్
- హైస్కూల్ 5, యూపీ స్కూల్స్ 3 ప్రాజెక్ట్‌లు తప్పనిసరి
- ఈ లెక్కన 4,597 ప్రాజెక్ట్‌ల ప్రదర్శనకు అవకాశం
- ఎంపికైన ఒక్కో దానికి కేంద్రం రూ.10 వేలు జమ
- ముగిసిన ఇన్‌స్పైర్ నమోదు గడువు
- ఇప్పటి వరకు 2,767 ప్రాజెక్ట్‌లు మాత్రమే నామినేషన్
- అవినీతిలో మునిగిపోయిన విద్యాశాఖ
- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని ప్రైవేట్ యాజమాన్యాలు



ఇన్‌స్పైర్ మనక్‌లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రాజెక్ట్‌ల నమూనాలు (ఫైల్)





నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖ ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల అడుగులకు మడుగులొత్తుతోంది. విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన యాజమాన్యాలకు దిశానిర్దేశం చేయాల్సి ఉండగా నిస్సహాయత ప్రదర్శిస్తోంది. విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురాకుండా యాజమాన్యాలు ఆదిలోనే అంతమొందిస్తున్నాయి. గత ప్రభుత్వం నాణ్యమైన ప్రజ్ఞ, గుణాత్మక విద్యకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించింది. అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో విద్యా విధానం మారిపోయింది. ప్రధానంగా ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్‌ల నామినేషన్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు ముందుకు రాలేదు. ప్రభుత్వ పాఠశాలల నుంచి కూడా ఆశించినంత స్థాయిలో నమోదు కాలేదు. ఇన్‌స్పైర్‌లో కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయకుండా మొక్కుబడిగా గతంలో చేసిన ప్రాజెక్ట్‌లతోనే మమ అనిపిస్తున్నారు. ఓ వైపు ఇన్‌స్పైర్ మనక్‌పై అవగాహన, విస్తృత ప్రచారం కల్పించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో 4,597 ప్రాజెక్ట్‌లకు అవకాశం

జిల్లాలో ఉన్న మొత్తం 1,124 ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్ట్‌ల కోసం నమోదు చేయాలని డీఈఓ పీవీజే రామారావు ఆదేశించారు. ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్ట్‌లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్ట్‌లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 వేలు నేరుగా విద్యార్థుల అకౌంట్లలో జమ చేస్తోంది. జిల్లాలో ఉన్న పాఠశాలల ప్రకారం 4,597 ప్రాజెక్ట్‌లను నమోదు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ 2024–25 విద్యా సంవత్సరానికి కేవలం 2,767 ప్రాజెక్ట్‌లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో 3,128 ప్రాజెక్ట్‌లు నమోదయ్యాయి. నవంబర్ చివరి వారం లేదా డిసెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అత్యధికంగా నమోదయ్యాయి. కరోనా విజృంభించిన ఏడాదిల్లో కూడా భారీగానే నమోదు కావడం విశేషం.

ఐదేళ్లల్లో నమోదు, ఎంపికైన ప్రాజెక్ట్‌ల వివరాలు

సంవత్సరం	నమోదు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి	జాతీయ స్థాయి	అంతర్జాతీయ స్థాయి
2019-20	3,692	564	55	04	01
2020-21	2,021	285	28	02	--
2021-22	2,864	302	26	04	--
2022-23	3,024	153	13	00	--
2023-24	3,128				
2024-25	2,767				

ముందుకు రాని ప్రైవేట్ యాజమాన్యాలు

జిల్లాలో 297 ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ మనక్‌కు ప్రాజెక్ట్‌లను నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రైవేట్ యాజమాన్యాలు పెడ చెవిన పెట్టాయి. కేవలం 134 పాఠశాలలు మాత్రమే ఇన్‌స్పైర్ మనక్‌కు మొక్కుబడిగా ప్రాజెక్ట్‌లను నమోదు చేసుకున్నాయి. 163 పాఠశాలలు ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా నమోదు చేయకపోవడం చూస్తే విద్యాశాఖ ఆదేశాలంటే ఏమాత్రం లెక్కలేని తనంగా కనిపిస్తోంది. ప్రతి ఏటా పాఠశాల గుర్తింపు రెన్యూవల్, ఎన్‌రోల్‌మెంట్ తదితర సమయాల్లో జిల్లా విద్యాశాఖలో కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు మామూళ్లు దండుకుంటున్న నేపథ్యంలోనే ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.



ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్‌కు నామినేషన్ వేయాలని చెప్పాం



జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి నిర్దేశించిన ప్రాజెక్ట్‌లను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించాం. ప్రతి రోజు సమావేశాలు, వెబెక్స్‌ల ద్వారా ఫాలోఅప్ చేస్తున్నాం. ఆయా మండలాల్లో ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు ఫాలోఅప్ చేయాల్సి ఉంది. ఇంత తక్కువ ప్రాజెక్ట్‌లకు నామినేషన్ వేయడంపై పరిశీలిస్తాం.

– పీవీజే రామారావు, డీఈఓ

మసీదు పక్కనే మద్యం

పచ్చ మాఫియా బరితెగింపు

- ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తూ దుకాణాల ఏర్పాటు
- నెల్లూరులో ఆత్మకూరు బస్టాండ్ వద్ద పోటాపోటీగా షాపులు
- రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మౌనముద్ర

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ ఇలాకాలో మద్యం మాఫియా చెలరేగిపోతోంది. వ్యాపారార్జనే ధ్యేయంగా గుడి, బడి, మసీదులు జనావాసాల మధ్యనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఓ వైపు జనావాసాల మధ్య దుకాణాల ఏర్పాటుపై మహిళోద్యమం హోరెత్తుతోంది. మసీదుల పక్కన షాపుల ఏర్పాటును ముస్లింలు వ్యతిరేకిస్తున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం చలించడం లేదు. ముస్లింల ప్రతినిధి అని చెప్పుకునే రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మౌనముగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నెల్లూరు ఆత్మకూరు బస్టాండు వద్ద మసీదు ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎక్సైజ్ శాఖ మలినమైపోయింది. ఆ శాఖను అధికారులు మద్యం మాఫియాకు తాకట్టు పెట్టేశారు. వారిచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి బడి, గుడి, మసీదులు, చర్చిలు, ఆస్పత్రులు, జనావాసాల మధ్య సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా.. ఎక్కడేమి జరుగుతున్నా తమకేమి పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది.

మసీదు పక్కనే..

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో మసీదు ఉంది. ముస్లింలు నాలుగు వేళలా నమాజ్ చేసుకుంటున్నారు. వక్ఫ్‌బోర్డు అధీనంలో ఆ మసీదు నిర్వహణ జరుగుతోంది. మసీదు ముందు భాగంలో గదులు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారు. మసీదు పక్కనే ఆర్టీసీ బస్టాండ్, దానికి సమీపంలోనే రైల్వేస్టేషన్ ఉంది. సమీపంలోనే స్టోన్ హౌస్‌పేట వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వేలాది మంది ప్రయాణికులతో పాటు చిరు వ్యాపారులతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే బిజినెస్ బాగా జరుగుతుందని భావించిన మద్యం మాఫియా పోటాపోటీగా పక్క పక్కనే రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశాయి.

నిబంధనలు అతిక్రమించి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30 పడకల ఆస్పత్రి, దేవదాయశాఖ, వక్ఫ్ బోర్డు అధీనంలో ఉండే గుడి, మసీదులకు వంద మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలనే నిబంధనలు పక్కాగా ఉన్నాయి. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో వక్ఫ్‌బోర్డు అధీనంలో ఉన్న మసీదుకు 30 మీటర్ల దూరంలోనే రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అవి ఏర్పాటు చేసే సమయంలో సంబంధిత ఎక్సైజ్‌శాఖ పరిశీలించి లైసెన్స్ ఇవ్వాలి. సంబంధిత అధికారులు నిబంధనలు కాలరాసి ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తూ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయించారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇలాకాలోనే..

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నెల్లూరుకు చెందిన అబ్దుల్ అజీజ్‌ను ప్రభుత్వం నియామకం చేసింది. ముస్లిం ప్రతినిధిగా ప్రస్తుతం కీలక స్థానంలో ఉన్నారు. ఆయన ఇలాకాలోనే నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్‌బోర్డు అధీనంలో ఉన్న మసీదు పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే కిమ్మనకుండా వ్యవహరించడంపై ముస్లింలు భగ్గుమంటున్నారు. మద్యం దుకాణాల యజమానులు తెలుగు తమ్ముళ్లు కావడంతో పాటు షాడో మంత్రి కనుసన్నల్లో మద్యం మాఫియా రెచ్చిపోతుండడంతో ఎక్కడా కూడా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఉన్న అజీజ్ అడ్డుకోలేదని పలువురు ముస్లిం ప్రతినిధులు మండిపడుతున్నారు.

జాతీయ రహదారి పక్కనే దుకాణాలు

మరో వైపు జనావాసాలు, జాతీయ రహదారి పక్కనే దుకాణాలను ఏర్పాటు చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ, దాదాపు వారం రోజులుగా స్థానిక మహిళలు, ప్రజలు ఆందోళన చేస్తున్నా.. కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంపై మహిళలు మండిపడుతున్నారు. రోజు రోజుకు ఎక్కడికక్కడ ఉద్యమాలు తీవ్రతరం అవుతున్నాయి. ప్రజల మనోభావాలు, మతాల మనోభావాలు పట్టవా అంటూ నిలదీస్తున్నారు. ప్రధానంగా నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రి సర్కిల్‌లో జాతీయ రహదారి పక్కనే అపార్ట్‌మెంట్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఉన్నత వర్గాలకు చెందిన మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపడుతున్న పరిస్థితి నెలకొంది. మహిళల ఆందోళనకు ఎమ్మెల్సీ, నగర నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మద్దతుగా పాల్గొని మద్యం షాపు మరో ప్రాంతానికి తరలించాలని హెచ్చరించారు. మరో వైపు కోవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే సాయిబాబా మందిరం ఉంది. అక్కడే మద్యం షాపును ఏర్పాటు చేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.



కోవూరు జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం



మెడికవర్ ఆస్పత్రి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగించాలని నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న మహిళలు



జగదీష్‌నగర్ మద్యం దుకాణం వద్ద మీడియాతో మాట్లాడుతున్న స్థానిక మహిళలు

కదం తొక్కిన మహిళలు

నెల్లూరు (క్రైమ్): నగరంలోని జగదీష్‌నగర్ జనావాసాల నడుమ ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని స్థానికులు చేస్తున్న ఆందోళన తీవ్రతరంగా మారింది. ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడంతో బుధవారం మహిళలు, స్థానికులు షాపు వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. షాపును తెరవనీయకుండా అడ్డుపడ్డారు. దుకాణం కౌంటర్ వద్దకు వెళ్లి నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. జనావాసాల మధ్య మద్యం షాపు వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా దుకాణాన్ని తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. జగదీష్‌నగర్‌లో మద్యం షాపు వద్ద స్థానికుల ఆందోళనకు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు.

మసీదు వక్ఫ్ బోర్డుకు చెందినదే

ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న మసీదు వక్ఫ్‌బోర్డు చెందినదే. మద్యం దుకాణాలు ఏర్పాటు సమయంలో మేము వక్ఫ్‌బోర్డు అధీనంలో ఉన్న మసీదుల జాబితా ఇచ్చాం. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఏర్పాటు చేయకూడదు. మేము సంబంధిత ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– ఖుదావన్, వక్ఫ్ బోర్డు మేనేజర్, నెల్లూరు



మెడికవర్ ఆస్పత్రి సర్కిల్‌లో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి

‘మద్యం మాకొద్దు.. మంచినీళ్లు కావాలి’

- నివాసాల మధ్య దుకాణం ఏర్పాటుపై మహిళల ఆందోళన

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో విజయ డెయిరీ సెంటర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మహిళలు బుధవారం ఆందోళన నిర్వహించి భారీ ర్యాలీ చేపట్టారు. ‘మద్యం మాకొద్దు.. మంచినీళ్లు కావాలి’ అంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు 53వ డివిజన్ వెంకటేశ్వరపురం, పునరావాసకాలనీ, నల్లకాలువ ప్రాంతాల్లో ర్యాలీలో నినాదాలతో హోరెత్తించారు. అనంతరం మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, నగర కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని మూడు రోజుల నుంచి మహిళలు వ్యతిరేకిస్తూ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారన్నారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఇప్పటికే ఒక బార్‌ను ఏర్పాటు చేశారని, నల్లకాలువ ప్రాంతంలో మరొక బార్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. స్థానికంగా తాగునీటి సమస్య ఉందని, ఆ సమస్య పరిష్కరించకుండా మద్యం దుకాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం కంటే నాణ్యమైన మద్యాన్ని రూ.99కే ఇస్తానని చెప్పడం, దానికి కేబినెట్ ఆమోదం చెప్పడం సిగ్గుచేటన్నారు. మహిళల రక్షణకు కేబినెట్‌లో చర్చించి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సింది పోయి మద్యంపై నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. పెరిగిన వంట నూనెల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు తగ్గించాల్సింది పోయి మద్యాన్ని తగ్గించి విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం తగదని హెచ్చరించారు. మహిళల మాన, ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్ర ఖజానాను నింపుకునే దుస్థితికి దిగజారడం సిగ్గు చేటన్నారు. పోలీసుల రక్షణతో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారు ప్రజలకు మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి మద్యం దుకాణానికి రక్షణ కల్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలతో రోడ్డెక్కి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు శివకుమారి, ఆదిలక్ష్మి, భాగ్యమ్మ, షాహిన్, భార్గవి, షకీల, మంజుల, లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



వెంకటేశ్వరపురంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

క్లుప్తంగా

సోమిరెడ్డి దోపిడీని అడ్డుకుంటా

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు): 'సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజల సొత్తును దోచుకోవడాన్ని నేను అడ్డుకుంటా. నియోజకవర్గంలో ఎటువంటి నష్టం కలగకుండా చూసుకునే బాధ్యత నాది' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమిరెడ్డికి పిచ్చి ముదురుతోందని వెంటనే వైద్యం చేయించకపోతే, ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి ఉండదని టీడీపీ నాయకులే అంటున్నారని, అయన అవినీతిపై ప్రశ్నించిన వారిపై పిచ్చికుక్కలా అరవడం పరిపాటైందన్నారు. ఎవరైనా ఎక్కడైనా పొరపాటు చేస్తే దానిని నాకు ఆపాదిస్తూ శునకానందం పొందుతున్నాడని ఎద్దేవా చేశారు. అధికారులు తప్పు చేస్తే నిబంధన ప్రకారం ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం పరిపాలనా విధానమన్నారు. అయితే ఎవరి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకున్నా వాటికి కారణం కాకాణి అని సోమిరెడ్డి మాట్లాడడాన్ని టీడీపీ నాయకులే వ్యతిరేకిస్తున్నా సిగ్గు రావడం లేదన్నారు. పొదలకూరు అక్రమ లేఅవుట్ల విషయంలో రూ.కోట్లు దండుకున్న సోమిరెడ్డి పుణ్యాన రేపు ఎంతమంది ఉద్యోగులు బలవుతారో తెలియడం లేదన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగి నన్ను ఏదో ఒక కేసులో ఇరికించాలని చంద్రమోహన్‌రెడ్డి ఎంత వెంపర్లాడినా, ఎక్కడా ఆధారాలు లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారన్నారు. సోమిరెడ్డి నడుపుతున్న శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, అక్రమ వసూళ్లకు నన్ను అడ్డు లేకుండా చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో కుట్రలు పన్నుతున్నాడని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ఏ విచారణలోనైనా నా పాత్ర ఉన్నట్లు స్పష్టం చేయాలని ఎమ్మెల్యేకి మరోసారి సవాల్ విసురుతున్నానన్నారు.

26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ఐటీఐల్లో 2024 - 25 విద్యా సంవత్సరంలో ఆయా బ్రాంచ్‌ల్లో మిగిలిన సీట్ల కోసం ఐదో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐటీఐల కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామన్నారు. చేరాలనుకున్న ఐటీఐలో ఈనెల 27వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో 28న, ప్రైవేట్ ఐటీఐల్లో 30న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు.


మంత్రి హామీ.. కాగితాలకే పరిమితం

అన్నదాతలకు ఉపయోగపడే పనులు చేయడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఘనంగా హామీలైతే ఇస్తున్నారు. కానీ అవి నెరవేరడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. వారికి ఉపయోగపడే పనులను వేగంగా చేసిన పరిస్థితులున్నాయి. నేడు మంత్రి నిమ్మల రామానాయుడు హామీ కూడా నీటి బుడగలా మారింది.

- పంట కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక
- బాగు చేస్తామని రెండు నెలల క్రితం ఇరిగేషన్ మంత్రి హామీ
- ఇంకా పనులు చేపట్టని వైనం
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు



నెల్లూరు మైపాడు గేటు వద్ద జాఫర్ సాహెబ్ కాలువలో ఇదీ పరిస్థితి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రైతులు పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలున్నాయి. అయితే వాటి నుంచి పంట పొలాలకు నీరందించే కాలువల పరిస్థితి దారుణంగా మారింది. పెన్నా నది నుంచి అన్ని కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. వర్షాల కారణంగా పూడిక కూడా అధికంగా ఉంది. ప్రతి కాలువలో పూడిక భారీ స్థాయిలో ఉండడంతో నీరు ప్రవహించే పరిస్థితి లేదు. రెండు నెలల క్రితం ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో వారం రోజుల్లో కాలువల్లో పూడిక తీసేలా చర్యలు చేపడతామని ఆర్భాటంగా చెప్పారు. ఇంత వరకు ఒక్క కాలువలో కూడా పూడిక తీయలేదు. డెల్టాలో రబీ పంటకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో వారే స్వయంగా పూడికలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎక్కడెలా..

సర్వేపల్లి ప్రధాన కాలువ నుంచి పెనుబర్తి, కలివెలపాళెం, కనుపర్తిపాడు, గొలగమూడి, కాకుపల్లి, గుండ్లపాళెం చెరువులకు నీరందుతుంది. కృష్ణపట్నం కాలువ నుంచి పైనాపురం, పిడతాపోలూరు, వడ్డిపాళెం, వరిగొండ, జంగాలకండ్రిగ, ముత్తుకూరు, మల్లూరు, వరకవిపూడి చెరువులకు నీరు సరఫరా అవుతుంది. వల్లూరు కాలువ నుంచి బ్రహ్మదేవి, మాదరాజుగూడూరు, దువ్వూరి వారిపాళెం, పంటపాళెం తదితర చెరువులకు నీటి సరఫరా జరుగుతుంది. జాఫర్ సాహెబ్ కెనాల్ నుంచి మైపాడు, గంగపట్నం, మాచర్లవారిపాళెం, కోడూరు, ఈదూరు, కుడితిపాళెం చెరువులకు నీరందుతుంది. అక్కడి నుంచి కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరాల్సి ఉంటుంది. డెల్టాలోని ఈ ప్రధాన కాలువలు అధ్వానంగా ఉండడంతో రైతులు వర్షపు నీటిపై ఆధారపడి నార్లు వేయడం ప్రారంభించారు. అధికారులు మాత్రం గుర్రపుడెక్కను తొలగించి పూడికను తీయించే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క



నెల్లూరు బ్యారేజ్‌లో గుర్రపుడెక్క

అలా వదిలేశారు

కాలువల్లో పూడికతీత తదితర వాటికి సంబంధించి ఇరిగేషన్ శాఖ జిల్లాలో 574 పనులకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ఆత్మకూరు నియోజకవర్గంలో 77 పనులు, కోవూరులో 106, నెల్లూరు రూరల్‌లో 80, సర్వేపల్లిలో 126, కావలిలో 113, ఉదయగిరి నియోజకవర్గంలో 72 పనులున్నాయి. అయితే ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదు. నిధులు మంజూరయ్యాయి. టెండర్లు ఆహ్వానించామని సంబంధిత అధికారులు చెబుతున్నా పనులు ఇప్పట్లో ప్రారంభించే దాఖలాలు కనిపించడం లేదు. మంత్రి హామీకే దిక్కులేకుండా పోయింది.

టెండర్లు ఆహ్వానించాం

పూడికలు తీసేందుకు టెండర్లను ఆహ్వానించాం. ప్రభుత్వం ఇటీవలే కాలువల మరమ్మతుల కోసం రూ.28.5 కోట్లు మంజూరు చేసింది. త్వరలో పనులను ప్రారంభించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, సెంట్రల్ డివిజన్ ఈఈ

చెప్పేదొకటి.. జరిగేదొకటి

- ఉచితం ఉత్తర్వుల మాటున యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- పొట్టేపాళెంలో తెలుగు తమ్ముళ్ల నిర్వాకం



పొట్టేపాళెం రీచ్‌లో ఇసుక తవ్వకాలు

నెల్లూరు సిటీ: సీఎం చంద్రబాబు నాయుడు సమావేశాల్లో చెప్పే మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు ఏ మాత్రం పొంతన ఉండడం లేదు. అక్రమాల గురించి అయనకు తెలిసినా తనకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో ఇసుకను తవ్వుకుని గృహ నిర్మాణాలకు వినియోగించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. టీడీపీ నాయకులు దీనిని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం రీచ్‌లో అధికార పార్టీ పెద్దల ఆశీస్సులతో ఓ కాంట్రాక్టర్ ఇసుక తవ్వకాలకు శ్రీకారం చుట్టాడు. సుమారు 20 మందిని రీచ్ వద్ద ఉంచి ఇది నా సామ్రాజ్యం.. ఎవరేం చేస్తారన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు.

రెండు జేసీబీలతో..

రెండు రోజుల నుంచి పొట్టేపాళెం రీచ్‌లో ఓ కాంట్రాక్టర్ టీడీపీ నేతల అండదండలతో రెచ్చిపోతున్నాడు. రెండు జేసీబీలతో బహిరంగంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్థానిక ప్రజలు మాత్రమే గృహ నిర్మాణాలకు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలించుకోవచ్చు. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పదుల సంఖ్యలో పొట్టేపాళెం రీచ్‌కు వచ్చి అక్రమంగా తవ్వకాలు, తరలింపు చేస్తున్నారు. ఇది కేవలం ఉదయం జరిగే తంతు మాత్రమే.

టిప్పర్లు వచ్చేస్తాయి

ఈ రీచ్‌లో ఉదయం సమయంలో ట్రాక్టర్లు మాత్రమే దర్శనమిస్తాయి. సాయంత్రం 6 గంటలు దాటితే సుమారు 40 టిప్పర్లు రంగ ప్రవేశం చేస్తాయి. జేసీబీలతో వేగంగా ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. నెల్లూరు నగరం, ఇతర ప్రాంతాలకు ఇష్టారాజ్యంగా తరలించి తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్లు అతివేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో జొన్నవాడ నుంచి నెల్లూరుకు వచ్చే రోడ్డులోని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదంతా పోలీసు అధికారులకు తెలిసినా అధికార పార్టీ పెద్దల ఒత్తిళ్ల కారణంగా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సత్యవతి ప్యానల్‌దే విజయం

• ఉత్కంఠగా నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు



సత్యవతి

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నెల్లూరులో జరిగాయి. ఇక్కడ ఇప్పటి వరకు ఏకగ్రీవంగా అసోసియేషన్ నేతలను ఎన్నుకునేవారు. అందుకు భిన్నంగా జిల్లాలో ప్రెసిడెంట్‌గా వరలక్ష్మి తరఫున ఒక ప్యానల్, సత్యవతి తరఫున మరొక ప్యానల్‌గా ఏర్పడి గత కొన్ని రోజులుగా పోటా పోటీ ప్రచారం నిర్వహించారు. ఏపీ ఎన్‌జీఓ సంఘం వరలక్ష్మి ప్యానల్‌కు మద్దతు పలికి వారికి అండగా నిలబడింది. ఏపీజీఈఏ అసోసియేషన్ సత్యవతి ప్యానల్‌కు అండగా నిలిచింది. దీంతో ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. నగరంలోని సర్వజన ఆస్పత్రి ఆవరణంలో ఉన్న నర్సింగ్ కళాశాలలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు రెండు షిఫ్టులలో నిర్వహించారు. సభ్యత్వం తీసుకున్న ఓట్లు 219 ఉన్నాయి. వీటిలో 207 ఓట్లు పోలయ్యాయి. 95 శాతం ఓటింగ్ నమోదయింది. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్నికలు నిర్వహించారు.

అన్ని పదవులు గెలుచుకున్న సత్యవతి ప్యానల్

ఎన్నికల్లో ప్రెసిడెంట్‌తోపాటు అన్ని పదవులు సత్యవతి ప్యానల్‌ను వరించాయి. ప్రెసిడెంట్‌గా వై.సత్యవతి 120 ఓట్లు సాధించి గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.సుమతి (122 ఓట్లు), సెక్రటరీగా ఎస్.వసుంధర (120), కోశాధికారిగా వి.అరుణకుమారి (117), ఈసీ మెంబర్లుగా నిర్మలజ్యోతి (131), అజితజోహ్న (124), విజయమ్మ (118), లక్ష్మి (114), వెంకటరాధ (109) గెలిచి సత్తా చాటారు. వరలక్ష్మి ప్యానల్ తరఫున పోటీ చేసిన ఒక్కరూ కూడా విజయం సాధించలేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య భార్య చిట్టెమ్మ సైతం వరలక్ష్మి ప్యానల్ తరఫున వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 132
లేయర్ (లైవ్) : 115
బ్రాయిలర్ చికెన్ : 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 262
లేయర్ చికెన్ : 195

మీరు నాన్ లోకల్

- కేజీబీవీ దరఖాస్తుల్లో గందరగోళం
- జిల్లాల ఎంపికలో లోపించిన స్పష్టత
- నష్టపోతామని అభ్యర్థుల ఆందోళన

కందుకూరు రూరల్: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు అభ్యర్థులను నాన్ లోకల్‌గా చూపించడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ప్రకారం ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. అయితే గతంలో జిల్లాల పునర్విభజన జరిగింది. దీని ప్రకారం కొంతమంది ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో చిరునామా మాత్రం ప్రస్తుతం ఉంటున్న జిల్లా ప్రకారమే ఆన్‌లైన్‌లో ఓపెన్ అవుతున్నాయి. దీంతో అలానే వివరాలు నమోదు చేశారు. అయితే విద్యార్హత సర్టిఫికెట్లలో 4 నుంచి 10వ తరగతి వరకు ఏ జిల్లాలో చదివారు? అనే ఆప్షన్ ఉంది. దీంతో వారు పలువురు తాము చదువుకున్న పాత జిల్లాలను నమోదు చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న అభ్యర్థుల దరఖాస్తులు కొత్తగా ఏర్పడిన జిల్లాకు వెళ్లకుండా.. సర్టిఫికెట్ల ప్రకారం పాత జిల్లాకు వెళ్లాయి. దీంతో అక్కడి అధికారులు వీరంతా నాన్ లోకల్ కింద వస్తారని తేల్చడంతో తాము నష్టపోతున్నామని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఓ ఉదాహరణ

కందుకూరు నియోజకవర్గం నెల్లూరు జిల్లాలో చేరింది. గుడ్లూరు మండలానికి చెందిన ఓ అభ్యర్థిని ఆధార్ కార్డు ప్రకారం నెల్లూరు జిల్లా చిరునామాను నమోదు చేసింది. అయితే గతంలో 4 నుంచి 10వ తరగతి వరకు ప్రకాశం జిల్లాలో చదివినట్లుగా సర్టిఫికెట్లు ఉన్నాయి. ఈ దరఖాస్తు నెల్లూరుకు కాకుండా ప్రకాశం జిల్లా ఎస్ఎస్ఏ కార్యాలయానికి వెళ్లింది. దీంతో ఆ అభ్యర్థినిని నాన్‌లోకల్ కింద చూపించారు. తనకు లోకల్ జిల్లా అయిన నెల్లూరుకు దరఖాస్తు పంపించాలని సంబంధించిన అధికారులను అభ్యర్థించినా ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికే దరఖాస్తుల వెరిఫికేషన్ అయిపోయింది. సర్టిఫికెట్ల స్క్రూటినీ కూడా పూర్తవుతోంది. మార్కుల ప్రకారం మెరిట్ లిస్ట్ వస్తే నాన్ లోకల్ కింద ఉద్యోగం కోల్పోతామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలోని సుమారు 25 మందికి ఈ పరిస్థితి ఉంది. అన్ని జిల్లాల్లో ఇలాంటి సమస్యే ఉన్నట్లు అభ్యర్థులు చెబుతున్నారు.

జెడ్పీ హైస్కూల్ ప్లస్‌ను తనిఖీ చేసిన ఆర్‌ఐఓ

సంగం: మండలంలోని సంగం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌ను ఆర్‌ఐఓ డాక్టర్ శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం బుజ్జయ్య ఉన్నారు.

టీచర్‌నంటూ నమ్మించి.. బంగారంతో ఉడాయింపు

సీతారామపురం: జెడ్పీ హైస్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నానని ఓ వ్యక్తి బంగారు వ్యాపారి భార్యను బురిడీ కొట్టించి రూ.1.40 లక్షల విలువైన ఆభరణాలతో ఉడాయించిన ఘటన సీతారామపురంలో జరిగింది. దేవర వెంకటేశ్వర్లు సీతారామపురంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. పని మీద బుధవారం బయటకు వెళ్లడంతో ఆయన భార్య దుకాణంలో ఉంది. స్కూటీపై వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వర్లు ఉన్నాడా అని అడిగి తాను టీచర్‌నని పరిచయం చేసుకున్నాడు. 16.5 గ్రాముల రెండు జతల కమ్మలు, రెండు ఉంగరాలు తీసుకుని జెడ్పీ హైస్కూల్ వద్దకు వెళ్లి తమ వారికి చూపించి వస్తానని, ఆ తర్వాత నచ్చిన ఆభరణాన్ని కొంటానని చెప్పడంతో ఆమె నమ్మింది. దుకాణానికి కూతవేటు దూరంలో హైస్కూల్ ఉండడంతో ఆమె ఆభరణాలు ఇచ్చింది. అతను తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన ఆమె బంధువులకు చెప్పి గ్రామంలో గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. నిందితుడు స్కూటీపై దర్జాగా వెళ్లిపోవడం కనిపించింది.